సాక్షి నిజామాబాద్

శనివారం । 28 । డిసెంబర్ । 2024



సమ్మె బాటలో..
సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన ఇంకా కొలిక్కి రాకముందే పంచాయతీ కార్మికులు నిరసనబాట పట్టారు.
- 10లో ▸



అచ్చం అలాగే..
అబ్బుర పరిచే ధ్వని అనుకరణ మిమిక్రీ ఆర్టిస్టుల సొంతం. మిమిక్రీ డే సందర్భంగా ఆర్టిస్టులపై ప్రత్యేక కథనం.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /20.3

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మన్మోహన్‌సింగ్ కుటుంబానికి సీఎం, పీసీసీ చీఫ్ పరామర్శ



నిజామాబాద్ సిటీ : ఢిల్లీలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ నివాళులు అర్పించారు. అనంతరం మన్మోహన్ సింగ్ సతీమణిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మన్మోహన్ చిత్రపటానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

వారం రోజులు సంతాప దినాలు

నిజామాబాద్‌అర్బన్ : భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోందని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు సంతాప దినాలు పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు శుక్రవారం నిర్వహించాల్సిన పాసింగ్ అవుట్ పరేడ్ (పీవోపీ)ను వాయిదా వేసినట్లు కమాండెంట్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో ప్రభుత్వం శుక్రవారం సెలవుతోపాటు వారంపాటు సంతాప దినాలు నిర్వహించాలని ప్రకటించిందన్నారు. త్వరలోనే పీవోపీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

నీలకంఠేశ్వరాలయంలో సీల్డ్ కొటేషన్లకు ఆహ్వానం

నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వార్షిక పండుగలు రథసప్తమి, మహాశివరాత్రి సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయుటకు సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయశాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ శ్రీరాంరవీందర్ తెలిపారు. విద్యుత్ అలంకరణ, బారీకేడ్ల ఏర్పాటు, రంగులు వేయుటకు ఆసక్తిగలవారు ఈనెల 31న మధ్యాహ్నం 12 గంటలకు ఆలయంలో కొటేషన్లు సమర్పించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి సోమ వారం కూరగాయలు సరఫరా చేయుటకు, వంటచేరుకు సరఫరా చేయుటకు, ప్రతి రోజు దేవతామూర్తులకు అలంకరణ గురించి పూల దండలు సరఫరా చేయుటకు అదే రోజు ఉదయం 10గంటలకు సీల్డ్ కొటేషన్లు ఆలయ కార్యాలయంలో సమర్పించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడిలో శుక్రవారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. మైనర్ బాలిక వివాహం బీబీపేట మండలంయాడారం గ్రామానికి చెందిన ఓ యువకుడితో చేయ డానికి కులపెద్దలు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, రెవె న్యూ అధికారులు, పోలీసులు అక్కడికి చేరు కున్నారు. ఇరువర్గాలతో మాట్లాడి, బాలికకు పెండ్లి చేయవద్దని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలికను కామారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించారు.

బేరం కుదిరాకే..



నిజామాబాద్ నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు ఉద్యోగులు అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను మొదట రిజెక్ట్ చేస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు గత్యంతరం లేక ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. ఆ తర్వాతే టీపీవో సిబ్బంది రెండోసారి దరఖాస్తు చేయించి అనుమతులు ఇస్తున్నారు. మరోవైపు ఈ అక్రమాలను కట్టడి చేయాల్సిన ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

- నగరపాలక సంస్థలో దరఖాస్తుదారులతో చెలగాటం
- భవన నిర్మాణాల దరఖాస్తులు మొదటిసారి రిజెక్ట్
- ముడుపులు చెల్లించుకున్నాకే రెండోసారి దరఖాస్తుకు అప్రూవల్
- అడ్డుకట్ట వేయలేకపోతున్న కీలక ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగర పాలక సంస్థలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసే విషయంలో ముఖ్యమైన ప్రజాప్రతినిధులు సఫలం కాలేకపోతున్నారు. దీంతో కొందరు అధికారులు, ఉద్యోగులు ఇష్టం వచ్చినట్లు చెలరేగిపోతున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు జేబులు నింపుకోవడమే పనిగా అక్రమ వ్యవహారాలు నడిపిస్తున్నారు. తాము ఏం చేసినా ఎవరూ ఏంచేయలేరనే ధీమాతో బరితెగిస్తున్నారు. సిబ్బంది కొరత ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి మాత్రం మరోలా ఉంటోంది. డబ్బులు దండుకునే విషయంలో సిబ్బంది తమకు ఎదురే లేదన్నట్లుగా కథలు నడిపిస్తున్నారు. గత ప్రభుత్వం ఉన్న సమయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించిన కొందరు ఉద్యోగులు, అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం ప్రక్షాళన చేసే విషయంలో ఏమాత్రం ఆలోచన చేయకపోవడంతో జేబులు నింపుకోవడమే పనిగా రెచ్చిపోతున్నారు. పోస్టింగ్‌ల విషయంలో హైదరాబాద్‌లోని డైరక్టరేట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఉన్నతాధికారుల వద్ద నుంచి తమకు నచ్చినట్లు నడిపించుకుంటున్నారు. నిజామాబాద్ నగరపాలక టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌కు సూపర్‌వైజర్ నుంచి టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉద్యోగోన్నతి రాగా మెట్‌పల్లి మున్సిపాలిటీలో పోస్టింగ్ వచ్చింది. అక్కడ బాధ్యతలు తీసుకుని వారంలో మూడు రోజులు అక్కడ పనిచేస్తున్నాడు. మరో మూడు రోజులు నిజామాబాద్ నగరపాలక సంస్థలో గతంలో ఉద్యోగోన్నతి రాకముందు చేసిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తూ వస్తున్నాడు. ఉద్యోగోన్నతి వచ్చాక కొత్త స్థానంలో పనిచేస్తూనే, పాత స్థానంలో పాత పోస్టులో కొనసాగేలా ఉన్నతాధికారులు అవకాశమివ్వడమేమిటని, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేవిధంగా చేయడమేమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఇందూరు నగరపాలక సంస్థలో దరఖాస్తుదారులతో చెలగాటం ఆడుతున్నారు. మొదటిసారి దరఖాస్తు చేస్తే టీపీఎస్ నుంచి టీపీవోకు వెళితే రిజెక్ట్ చేస్తున్నారు. అయితే మొదటి ఫీజులోనే పూర్తి మొత్తం దరఖాస్తుదారుడి ఖాతా నుంచి టీఎస్‌బీపాస్ ద్వారా ప్రభుత్వానికి బదిలీ అవుతుంది. ఈ క్రమంలో రిజెక్ట్ చేసిన తరువాత 10 శాతం నగదు మినహాయింపుతో తిరిగి వస్తుంది. తరువాత బేరం చేసుకుని మరోసారి దరఖాస్తు చేయించి సొంత జేబులు నింపుకున్నాక మాత్రం అదే దరఖాస్తు అప్రూవ్ చేస్తున్నారు. ఈ విషయమై పలువురు దరఖాస్తుదారులు ఎంత పోరాటం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరకు గత్యంతరం లేక ముడుపులు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఇలా జేబులు నింపుకుంటూ ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండికొడుతున్న అధికారులు, ఉద్యోగుల విషయమై తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఉపేక్షించడమేమిటని పలువురు అంటున్నారు.

సీసీ ఫుటేజీ.. వాట్సాప్ చాటింగ్‌లే..

కీలక ఆధారం

ముగ్గురి మృతి మిస్టరీ తేల్చేపనిలో పోలీసులు

- కాల్‌డేటా పరిశీలన
- ఫోన్‌ల లాక్ ఓపెన్ అయితేనే స్పష్టత వచ్చే అవకాశం
- ముగ్గురు ఎందుకు కలవాల్సి వచ్చిందనే దానిపై దృష్టి
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు



సాయికుమార్ శ్రుతి నిఖిల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఏకకాలంలో జరిగిన ముగ్గురి మరణాల మిస్టరీని తేల్చేందుకు పోలీసు అధికారులు విచారణ ముమ్మరం చేశారు. చాలా కాలంగా క్లోజ్‌గా ఉన్న వాళ్లు కలిసి చనిపోవడానికి కారణాలు ఏమిటనేదానిపై ఆరా తీస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో బుధవారం సాయంత్రం భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శృతి, బీబీపేటకు చెందిన నిఖిల్‌లు చనిపోయిన విషయం తెలిసిందే. ఎస్సై, మహిళా కానిస్టేబుల్ చనిపోయిన ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. కేసు మిస్టరీని ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై సాయికుమార్ వద్ద రెండు ఫోన్లు, కానిస్టేబుల్ శృతి ఒక ఫోన్, నిఖిల్ రెండు ఫోన్లు వాడినట్లు నిర్ధారణకు వచ్చారు. ముగ్గురి కాల్ డేటాను ఇప్పటికే పరిశీలించారు. గడిచిన వారం రోజుల్లో ముగ్గురు పలుమార్లు కాల్స్ మాట్లాడినట్లు కాల్‌డేటా ద్వారా వెల్లడైనట్లు తెలుస్తోంది. ముగ్గురి మధ్య ఉన్న పరిచయాలు, వాళ్లు సడెన్‌గా ఆ రోజు ఎందుకు కలవాల్సి వచ్చింది ? అక్కడ జరిగిన గొడవ ఏమి టి? అనే అంశాలపై పోలీసులు ఫోకస్ చేస్తున్నారు.

భిక్కనూరు నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి దాకా..

పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. భిక్కనూరు టోల్ ప్లాజా దగ్గర నుంచి మొదలుకుని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరకు జాతీయ రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. జాతీయ రహదారిపై ఓ దాబా హోటల్ సమీపంలో నిఖిల్ బైకును ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ హోటల్ వద్ద కలిసి భోజనం చేశారన్న ప్రచారం జరగడంతో అధికారులు హోటల్ సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే అక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదని చెబుతున్నారు. అక్కడి నుంచి ముగ్గురు కారులో కామారెడ్డి పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు గుండానే నిజామాబాద్ రూట్లో వెళ్లినట్లు భావిస్తున్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలో రోడ్డు పక్కన కారు ఆపుకుని డిస్కషన్ చేసి ఉంటారని, ఎవరి కంట పడకుండా ఉండేందుకు చెరువు కట్టపైకి వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. ముగ్గురి చావుల మిస్టరీ పోలీసులకు సవాల్‌గామారింది.

వాట్సాప్ చాటింగ్‌లో ఏముందో..

ముగ్గురు కూడా రెగ్యులర్‌గా వాట్సాప్ వాడుతున్నట్లు పోలీసులు తమ ప్రాథమిక విచారణలో నిర్ధారించుకున్నారు. ఎస్సై సాయికుమార్ వాడుతున్న రెండు ఫోన్‌లలో ఒకటి కారులో ఉండగా, మరో ఫోన్ ఆయన ప్యాంట్ జేబులోనే ఉండిపోయింది. నీటిలో మునిగిపోవడంతో ఫోన్ ఆన్ కావడం లేదని తెలుస్తోంది. కారులో ఉన్న ఐ ఫోన్ స్క్రీన్ లాక్ ఉండడంతో ఓపెన్ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. అయితే ఎస్సై ఫోన్ లాక్ గురించి ఆయన భార్యను తెలుసుకునే ప్రయత్నం చేయగా, తనకు తెలియదనే సమాధానం వచ్చినట్లు సమాచారం. నిఖిల్ వాడుతున్న రెండు ఫోన్‌లలో ఒకటి లాక్ ఓపెన్ కావడం లేదని, మరొకదానిలో పెద్దగా చాటింగ్ లేనట్లు చెబుతున్నారు. శృతి ఫోన్ లాక్ సైతం ఓపెన్ కాలేదని తెలుస్తోంది. వాటిని ఓపెన్ చేయించేందుకు పోలీసు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాట్సాప్ చాటింగ్‌లో కచ్చితంగా ఏదో ఒక ఆధారం దొరుకుతుందనే నమ్మకంతో పోలీసులు ఉన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్‌సింగ్



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నుడా చైర్మన్ కేశవేణు తదితరులు

- నుడా చైర్మన్ కేశవేణు

నిజామాబాద్ సిటీ: ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశాన్ని ఆర్థికంగా బ లోపేతం చేసేలా సంస్కరణలు చేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్‌సింగ్ అని నుడా చైర్మన్ కేశవేణు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి ఎనలేని సేవలు చేశారని గు ర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చై ర్మన్ రాజారెడ్డి, నాయకులు విపుల్‌గౌడ్, వే ణురాజ్, సంతోష్, నరేందర్ గౌడ్, ఆకుల సుజాత, దాత్రిక భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దులం గ్రామంలో ఉన్న గంగమ్మ తల్లి జాతర వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. గతేడాది జాతరకు రాలేకపోయాయని, ఈసారి గంగమ్మ తల్లిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, నవీన్‌గౌడ్, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, నాయకులు పాలసాని శ్రీనివాస్, ఆనంద్, సాయరెడ్డి, సురేందర్‌రెడ్డి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

‘సాగర్’ జలాలు వృథా!

ఆయకట్టు కింద పంటల సాగు అవసరాలకు ప్రధాన కాలువ ద్వారా విడుదలవుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు జలాలు వృథా అవుతున్నాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న హెడ్‌రెగ్యులేటర్ గేట్ల ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు జలాలు మంజీరా నదిలోకి వెళ్తున్నాయి. రెండు, మూడు రోజులుగా నీరు మంజీరలోకి వెళ్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఎత్తింది ఎవరనేది చర్చనీయాంశమైంది. – నిజాంసాగర్(జుక్కల్)



క్రీడాకారులకు అభినందన



సాఫ్ట్ బాల్ క్రీడాకారులను సత్కరిస్తున్న సుద్దపల్లి గురుకుల ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన 37వ సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడాకారులు ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. శుక్రవారం వారు పాఠశాలకు రావడంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్స్ వనిత, స్వప్న, ఉపాధ్యాయులు జోత్స్న, శ్రీలత, కోచ్ మౌనిక, ఉపాధ్యాయులు సన్మానించి, అభినందించారు.

రేపు ఎమ్మెల్సీ కవిత రాక



నిజామాబాద్ అర్బన్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 29న నిజామాబాద్ వస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. లిక్కర్ కేసులో అరెస్టు, ఆరు నెలలు తిహార్ జైలులో ఉన్న అనంతరం మొదటి సారి జిల్లాకు వస్తున్నారు. డిచ్‌పల్లి వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వా గతం పలుకుతారు. బైపాస్ రోడ్డు మీదుగా సుభాష్ నగర్, ఎస్‌ఎఫ్‌ఎస్ సర్కిల్ వరకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఎస్ సర్కిల్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పుష్పాంజలి ఘటిస్తారు. అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

హెల్మెట్ భారం కాదు.. భరోసా

- ద్విచక్రవాహనదారులకు ఎంతో మేలు
- తప్పనిసరి ధరించాలంటున్న పోలీసులు
- రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కాకుండా నివారించే అవకాశం

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతిచెందిన, గాయాలైన ఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని పోలీసులు, రవాణాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. బైక్‌లపై వెళ్లే సమయంలో హెల్మెట్‌లు ధరించని వారికే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు న్యూరోసర్జన్లు చెబుతున్నారు. జిల్లాలో 85శాతం మంది ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ ధరించడం లేదని సమాచారం. రోడ్డు ప్రమాదంలో 60 నుంచి 70 శాతం వరకు హెల్మెట్ లేకనే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు.

పక్షం రోజుల్లో ఆరుగురు మృతి..

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి చౌరస్తా వద్ద హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్‌సింగ్(50) నవంబర్ 27న ఆర్మూర్ వైపు వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే అదే రోజు మామిడిపల్లి శివారులోని యానంగుట్ట వద్ద ట్రాక్టర్, బైక్‌ను ఢీకొని సోలంగంగాధర్(35) అక్కడిక్కడే మృతి చెందారు. వీరు హెల్మెట్ ధరించి ఉంటే తలకు గాయాలు కాకుండా బతికిఉండేవారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- పెర్కిట్ వద్ద గల 44 జాతీయరహదరిపై అశోక్ రెడ్డి(55) అనే వ్యక్తి డిసెంబర్ 1న హెల్మెట్ లేకుండా బైక్‌పై ఉదయం వ్యవసాయపనులకు వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 15 రోజులలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరుగురు మృతి చెందారు.



హెల్మెట్ వాడకంపై అపోహలు..

- మెడ నొప్పి, వెన్ను నొప్పి వస్తుందని..
- జుట్టు రాలిపోతుందని..
- పక్క వాహనాలు కనిపించవని..
- చెవులకు ఇబ్బంది అవుతుందని..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- హెల్మెట్‌ను ఎక్కువ సేపు ధరించడంతో జుట్టుపై చమటలు రావడం, జుట్టు చెదిరిపోవడం, దురుదపెట్టడం, చుండ్రురావడం జరుగుతుంది. హెల్మెట్‌ను క్లీన్ చేసుకుని..తలకు కాటన్ రుమాల్ కట్టుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.
- వాహనాదారుడు తన తలకు సరిపోయే హెల్మెట్‌ను వాడాల్సి ఉంటుంది. చిన్న హెల్మెట్ తీసుకుంటే తలనొప్పి వచ్చే అవకాశాలు ఉంటాయి.
- హెల్మెట్ కొనుగోలు చేసేటప్పుడు ఐఎస్‌ఐ ప్రమాణాలతో ఉన్న నాణ్యమైన వాటిని కొనుగోలు చేయాలి. దీనితో బైక్‌పై వెళ్లేటప్పుడు తలను అటువైపు ఇటువైపు తిప్పడానికి అవకాశం ఉంటుంది.
- చాలాసేపు బైక్‌లను నడపటంతో గుంటలు, స్పీడ్ బ్రేకర్లు వచ్చినప్పుడు వాహనాన్ని నెమ్మదిగా నడిపిస్తే మెడ, వెన్ను నొప్పి రాకుండా ఉంటుంది.
- బైక్‌పై ఒకవైపు వంగి కూర్చోవడంతోపాటు హ్యాండిల్ వంకరగా ఉండటంతో వెన్ను, మెడ నొప్పులు వస్తాయి.

తలకు గాయాలైతే నాడీవ్యవస్థ దెబ్బతింటుంది..



బైక్ పైనుంచి పడినవారికి ఎక్కువగా తలకు గాయాలు అవుతున్నాయి. దీంతో కొందరు మృత్యువాత పడగా కొందరు కోమాలకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. మనిషి శరీరంలో ఏ ప్రాంతంలో గాయాలు అయిన చికిత్స చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ తలకు బలమైన గాయం అయితే నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. ఇందుకోసం తలను రక్షించుకోవడానికి హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి. – పి పవన్‌కుమార్, న్యూరోసర్జన్, నిజామాబాద్

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



వేల్పూర్‌: మండలంలోని వెంకటాపూర్‌, కుకునూర్‌ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్‌ అంకిత్‌ కుమార్‌ శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటి స్థితిగతులు, కుటుంబ పరిస్థితులు, ఎక్కడ నివసిస్తున్నది స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పూర్తి చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో బాలకిషన్‌, జీపీ కార్యదర్శులు, సర్వే సిబ్బంది ఉన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌ నీటిమట్టం క్రమంగా తగ్గుతుందని ప్రాజెక్ట్‌ అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 175 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిప్ట్‌ ద్వారా 415 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకాలకు 312 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80,5 టీఎంసీలు) అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090. 60(78.86 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలపై నిలదీయాలి

రామారెడ్డి: కాంగ్రెస్‌ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల తాలూకా అమలును క్షేత్రస్థాయిలో గ్రామాలలో తిరిగి నిలదీయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం పలు బీజేపీ బూత్‌ కమిటీలను నియమించారు. అనంతరం బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఏడాది గడిచినా రైతుబంధు వేయలేదని, రైతులు అప్పుల కుప్పల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. సంక్రాంతి లోపు రైతుబంధును రైతుల ఖాతాలో జమ చేయకపోతే బీజేపీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్‌, మండల అధ్యక్షులు ఈశ్వర్‌, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గిద్ద వెంకన్న, సంజీవ్‌, నర్సింలు పాల్గొన్నారు.

అచ్చం అలాగే అనుకరిస్తూ.. మిమిక్రీకి వన్నె తెస్తూ..

- ఆకట్టుకుంటున్న జిల్లా ఆర్టిస్టులు
- నేడు అంతర్జాతీయ మిమిక్రీ దినోత్సవం



మాట్లాడే బొమ్మతో ప్రదర్శన ఇస్తున్న మిమిక్రీ ఆర్టిస్టు రంగనాథ్‌ (ఫైల్‌)

మోర్తాడ్‌/ఆర్మూర్‌/నిజామాబాద్‌ రూరల్‌: వారు పక్షిలా, జంతువులలాగా అరువగలరు.. పెద్ద పెద్ద రాజకీయ నాయకుల్లా, సినిమా నటుల్లా, ప్రముఖులలాగా మాట్లాడగలరు.. ప్రకృతి పరవశింపజేసే ఆహ్లాదకరమైన వాతావరణంను సైతం అనుకరించి తమ స్వరంతో అందరిని అబ్బురపరిచే ధ్వని అనుకరణ వారి సొంతం. వారే మిమిక్రీ ఆర్టిస్టులు. అలా మిమిక్రీకి పర్యాయపదంగా నిలిచిన నేరెళ్ల వేణుమాధవ్‌ జయంతిని పురస్కరించుకుని నేడు మిమిక్రీ డేను జరుపుకుంటున్నారు. ఈసందర్భంగా జిల్లాలోని మిమిక్రీ ఆర్టిస్టులపై సాక్షి ప్రత్యేక కథనం..

గురుశిష్యుల ప్రతిభ..

తమ ప్రదర్శనలతో ఎంతో మందిని సంతోషంతో గెంతులు వేసేలా చేస్తున్న మిమిక్రీ ఆర్టిస్టులు జిల్లాలో కొద్ది మందే ఉన్నారు. వారిలో ప్రముఖులు నిజామాబాద్‌లో స్థిరపడిన ఆర్మూర్‌కు చెందిన వేదాంతం రంగనాథ్‌. మిమిక్రీ ఆర్టిస్టుగానే కాకుండా మాట్లాడే బొమ్మ(వెంట్రిలాక్విజం)తో వినోదం పంచుతూ ఎన్నో ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా తన కళతో ఉత్సాహవంతులైన వారికి శిక్షణ ఇస్తున్నారు. మిమిక్రీ కళాకారునిగానే కాకుండా హిప్నాటిజంలోను రాణిస్తూ రంగనాథ్‌ తన శిష్యులైన బోండ్ల ఆనంద్‌తోను ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. తన గురువుతో కలిసి ఆనంద్‌ ఇప్పటి వరకు సుమారు ఐదు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. రెండు దశాబ్దాలకు పైగా ధ్వని అనుకరణతో వీక్షకుల మన్ననలు పొందుతున్న బోండ్ల ఆనంద్‌ పలు బిరుదులను సైతం సొంతం చేసుకున్నాడు. రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారుల చేతుల మీదుగా సన్మానాలు అందుకున్నారు.

అలాగే డిచ్‌పల్లిలో స్థిరపడిన కాగజ్‌నగర్‌కు చెందిన వాసా రాబర్ట్‌ పేయింటింగ్‌తోపాటు మిమిక్రీ కళలోను రాణిస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి తన కళను వినియోగిస్తున్నారు. ఇందల్వాయి మండలం మల్లాపూర్‌ గ్రామానికి చెందిన నడుకుల శంకర్‌ మిమిక్రీ శంకర్‌గా పేరు పొంది కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చారు. ప్రధానంగా విద్యార్థులలో జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెంపొందించేలా పాఠశాల, కళాశాలలో వందల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నతనంలోనే జ్ఞాన వాగ్దేవి విద్యాలయం నుంచి ప్రదర్శలను ప్రారంభించిన ఇందల్వాయికి చెందిన కందాళై దీక్షిత్‌ తన స్వరంతో అందరిని మాయ చేస్తున్నాడు. ఇప్పటి వరకు 500లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వేల్పూర్‌ మండలం జాన్కంపేట్‌ గ్రామానికి చెందిన సొడ రవి వృత్తి రీత్యా ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నాడు. చిన్నప్పటి నుంచి ధ్వని అనుకరణపై ఉన్న మక్కువతో మిమిక్రీ కళాకారుడిగా రాణిస్తున్నాడు. వీరంతా ధ్వని అనుకరణను ప్రదర్శిస్తూ పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. మిమిక్రీ పితామహుడు, పద్మశ్రీ నేరెళ్ల వేణు మాధవ్‌ స్ఫూర్తితో తమ కళలో రాణిస్తున్నామని చెబుతున్నారు. తమకు అవకాశం ఉన్న ప్రతి చోట స్వరంతో మాయ చేసే కళాప్రదర్శనలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.



వాసా రాబర్ట్‌, డిచ్‌పల్లి



కందాళై దీక్షిత్‌, ఇందల్వాయి



నడుకుల శంకర్‌, మల్లాపూర్‌

64 కళల్లో ఒకటి..



ధ్వని అనుకరణ 64 కళల్లో ఒకటి. ఈ కళ పూర్వ కాలం నుంచే ఉంది. రామాయణం, మహాభారతాల్లోను ధ్వని అనుకరణతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు సఫలం అయ్యాయి. ధ్వని అనుకరణ ఎవరైనా చెయ్యవచ్చు అందుకు సాధన ఎంతో అవసరం. స్వరం మార్చడం అనేది అంత సులభమైనది కాదు. ఎంతో కఠోర శ్రమతో అలవాటు చేసుకుంది.

– వేదాంతం రంగనాథ్‌, మిమిక్రీ ఆర్టిస్టు

మరింత రాణించాలని..



మిమిక్రీ కళను నమ్ముకొన్న నన్ను ఆదరించి ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా. నా తల్లిదండ్రులు, గురువు, మెజీషియన్‌ రంగనాథ్‌, భారత్‌ గ్యాస్‌ మేనేజర్‌ సుమన్‌ల ప్రోత్సాహంతో మిమిక్రీ చేస్తున్నాను. ఈ కళను మరింత మెరుగుపర్చుకొని ఆర్మూర్‌వాసిగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలనే సంకల్పంతో కష్టపడుతున్నాను.

– బోండ్ల ఆనంద్‌, మిమిక్రీ కళాకారుడు, ఆర్మూర్‌ పట్టణం

జిల్లా తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్‌

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల తహసీల్దార్‌ చెట్లపల్లి రాజా నరేందర్‌గౌడ్‌ తెలంగాణ తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ తహసీల్దార్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ చైర్మన్‌ లచ్చిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాములును శుక్రవారం హైదరాబాదులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

ఘనంగా వెంకట ఖాజా వార్షికోత్సవం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వెంకట ఖాజా ఆశ్రమంలో 21వ ఉర్సు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం భక్తులు గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కవ్వాలి, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆశ్రమం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు గంధం, పూలు ఊరేగించారు. భక్తులు అంకం కొండయ్య చిస్తీ, బాబా, చిరంజీవులు, గురుదేవ్‌, రాజు, శశికాంత్‌, తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమంలో గురువులను సన్మానిస్తున్న భక్తులు

సమ్మె బాటలో పంచాయతీ కార్మికులు!

- ఉద్యోగ భద్రత, పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

మోర్తాడ్‌(బాల్కొండ): సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన ఇంకా కొలిక్కి రాకముందే పంచాయతీ కార్మికులు నిరసనబాట పట్టారు. ప్రభుత్వం తమ పట్ల కనికరం చూపడం లేదని తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా ఈ ప్రభుత్వం అదే ధోరణి అవలంభిస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేమరకు తమ సమస్యలను పరిష్కరించాలని రెండు రోజుల టోకెన్‌ సమ్మెను పంచాయతీ కార్మికులు, కారోబార్లు శుక్రవారం ఆరంభించారు. శనివారం రోజు కూడా ఇలాగే సమ్మెను కొనసాగిస్తామని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే నెల 4నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని తెలంగాణ పంచాయతీ కారోబార్ల కార్మికుల సంఘం ప్రకటించింది.

ప్రభుత్వం స్పందించాలి

పంచాయతీ కార్మికుల న్యాయపరమైన ఆందోళన పట్ల ప్రభుత్వం స్పందించాలి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రభుత్వమైనా మానవతా దృక్పతంతో ఆలోచన చేయాలి. ఎన్నికల సంధర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

– చిలుక మారుతి, గ్రామ పంచాయతీ కారోబార్లు, కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

3,054 మంది కార్మికులు..

జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలు, పాత పంచాయతీలు కలిపి 545 ఉన్నాయి. వీటిల్లో కారోబార్లు, బిల్‌ కలెక్టర్లు, వాటర్‌మెన్‌లు, పారిశుధ్య కార్మికులు అందరూ కలిపి 3,054 మంది వరకు ఉన్నారు. ప్రతి కార్మికుడికి రూ.9,500ల వేతనంగా నిర్ణయించినా నిధుల కొరత కారణంగా అనేక పంచాయతీల్లో నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారు. వేతనాలు నిలచిపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు.

డిమాండ్లు ఇవే..

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, కారోబార్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. అనేక పంచాయతీల్లో నాలుగైదు నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. ఆదాయం ఎక్కువగా ఉన్నచోట, నిధులు సమృద్ధిగా ఉన్న కొన్ని పంచాయతీల్లోనే వేతనం చెల్లింపు సక్రమంగా జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులను కేటాయించి పంచాయతీ ఉద్యోగులకు వేతనాలు క్రమంగా చెల్లించాలని డిమాండ్‌ చేస్తున్నారు. 2వ పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకవచ్చి జీవో నంబర్‌ 60 ప్రకారం వేతనాలను కేటగిరి ప్రకారం చెల్లించాలని కోరుతున్నారు. జీవో నంబర్‌ 51ని సవరించి మల్టీపర్పస్‌ కార్మికుల విధానం రద్దు చేసి పాత కేటగిరిల ప్రకారం ఉద్యోగులను గుర్తించాలి. కారోబార్లు, బిల్‌ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలి. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్‌ బెనిఫిట్‌గా రూ.5లక్షల చొప్పున చెల్లించాలి. మరణించిన పంచాయతీ కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సాయంతో పాటు ప్లాట్లు ఇవ్వాలని కార్మికులు డిమాండ్‌ చేస్తున్నారు.



ఏర్గట్ల మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కారోబార్లు

జనవరి 4న అరుణాచలం యాత్ర

ఆర్మూర్‌టౌన్‌: అరుణాచలం గిరిప్రదక్షిణ కోసం ఆర్మూర్‌ ఆర్టీసీ డిపో నుంచి బస్సు యాత్ర (సూపర్‌ లగ్జరీ) జనవరి 4న మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరనున్నట్లు డీఎం రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్‌ టెంపుల్‌, జోగులాంబ యాత్రకు టికెట్‌ పెద్దలకు రూ. 4200, పిల్లలకు రూ. 3400 ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9948775487ను సంప్రదించాలని కోరారు.

సోమార్‌పేట్‌లో వందశాతం విద్యుత్‌ బిల్లులు వసూలు

ఎల్లారెడ్డిరూరల్‌: సోమార్‌పేట్‌లో వంద శాతం వ్యవసాయ బోరు బావుల విద్యుత్‌ బిల్లులు వసూలైనట్లు లైన్‌మాన్‌ బాలకిషన్‌ శుక్రవారం తెలిపారు. గ్రామంలో 79 వ్యవసాయ బోరు బావులకు సంబంధించి విద్యుత్‌ కనెక్షన్లు ఉండగా వాటి బిల్లు 35 వేల 285 రూపాయలు రైతుల నుంచి వసూలు చేయడం జరిగిందన్నారు.

ఏటీఎంను మార్చి డబ్బులు చోరీ

కామారెడ్డి క్రైం: ఓ కేటుగాడు ఏటీఎం కార్డును మార్చి ఓ వ్యక్తిని బురిడి కొట్టించి, డబ్బులు డ్రా చేసిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఇందిరానగర్‌ కాలనీకి చెందిన రాజు సిరిసిల్ల రోడ్డులో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లాడు. ఏటీఎం నుంచి డబ్బులు రాకపోవడంతో వెనకాలే ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి తాను డబ్బులు తీసి ఇస్తానని నమ్మించాడు. రాజు ఏటీఎం, పిన్‌ నెంబర్‌ తీసుకుని డబ్బులు రావడం లేదంటూ ఏటీఎం కార్డును మార్చి, రాజుకు ఇచ్చేసి వెళ్ళిపోయాడు. తర్వాత కొద్దిసేపటికి రాజు ఫోన్‌కు తన అకౌంట్‌ నుంచి రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజులు వచ్చాయి. మోసపోయినట్లు తెలుసుకొని రాజు వెంటనే బ్యాంకుకు వెళ్లి తన కార్డు బ్లాక్‌ చేయించడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

బోధన్‌ రూరల్‌: సాలూర మండలం సాలంపాడ్‌ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని ఎడపల్లి నర్సారెడ్డి అనే వ్యక్తి ఈనెల 21న తన ఇంటికి తాళం వేసి, భార్యతో కలిసి హైదరాబాద్‌ వెళ్లాడు. గురువారం రాత్రి వారు తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని 2 తులాల బంగారం, నాలుగు తులాల వెండి, రూ.25వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్‌

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి శుక్రవారం శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దొండి మోహన్‌(45) అనే వ్యక్తి కొంతకాలంగా కమ్మర్‌పల్లిలో పూల వ్యాపారం చేసుకుంటూ సాయిబాబా కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్య గంగామణితో పాటు, పిల్లలు ఉన్నారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మోహన్‌ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య గంగామణి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్‌ కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఉప్లూర్‌ రోడ్‌లో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఓ శవం తేలియాడుతూ స్థానికులకు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి, మృతదేహాన్ని దొండి గంగామోహన్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి అప్పులు ఉన్నట్లు తెలిసింది. ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామ సమీపంలోని పాముల వాగు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన వడ్ల కృష్ణమూర్తి తన బైక్‌పై లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా పాములవాగు వంతెన మూల మలుపు వద్ద బైక్‌ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కృష్ణమూర్తి చేయి విరగడంతోపాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

గంజాయి పట్టివేత



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌ గిర్ని చౌరస్తా వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురి వద్ద గంజాయి లభించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌ తెలిపారు. పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. భీంగల్‌ మండలం బడాభీంగల్‌ గ్రామానికి చెందిన ఒరగంటి శ్రీనివాస్‌, చిత్తరి అరుణ్‌, ఓ బాలుడు ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై వస్తుండగా, వారిని ఆపి సోదా చేయగా వారి వద్ద 60 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా భీంగల్‌ మండలం మెండోరా గ్రామానికి చెందిన కనక యశ్వంత్‌, బోదాసు నరేష్‌ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి పెద్దవాల్గోట్‌ గ్రామంలో వారి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. దీంతో పెద్దవాల్గోట్‌ గ్రామానికి వెళ్లి యశ్వంత్‌, నరేష్‌ను పట్టుకొని, వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్‌ చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఎస్సై ఎల్‌ రామ్‌, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సిమెంట్‌ లారీ బోల్తా



నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం సిమెంటు లారీ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. హైదరాబాద్‌ నుంచి గుజరాత్‌ వైపు వెళ్తున్న సిమెంటు లారీ అదుపుతప్పి నవీపేట రైల్వే గేట్‌ సమీపంలో బోల్తా పడింది. డ్రైవర్‌ ఇసుఫ్‌, క్లీనర్‌ సాజిద్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు.

ట్రాక్టర్‌ బోల్తాపడి ఒకరి మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: మండలంలోని ఇస్సాపల్లి గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌ బోల్తాపడిన ఘటనలో లక్ష్మయ్య(20) అనే కూలీ మృతిచెందాడు. వివరాలు ఇలా.. ఉన్నాయి. ఇస్సాపల్లి ఇటుకబట్టి నుంచి ఇటుక లోడ్‌తో ట్రాక్టర్‌ వెళుతుండగా మూలమలుపు వద్ద డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగా బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న లక్ష్మయ్య అనే ఇటుకబట్టి కూలీ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆర్మూర్‌టౌన్‌: మండలంలోని అంకాపూర్‌ గ్రామానికి చెందిన యాతగిరి నాగేంద్ర(21) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూర్‌ జిల్లాకు చెందిన నాగేంద్ర అంకాపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో నాగేంద్ర మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఒకరోజు సామాజిక సేవ చేయండి

- మందుబాబులకు బోధన్‌ కోర్టు శిక్ష

బోధన్‌టౌన్‌(బోధన్‌): బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ముగ్గురికి, గొడవపడ్డ ఐదుగురికి ఒకరోజు సామాజిక సేవ చేయాలని బోధన్‌ కోర్టు శుక్రవారం శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని, పట్టణంలోని గోసంగి బస్తీలో గొడవపడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకొని, కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం వీరందరికీ ఒకరోజు సామాజిక సేవ చేయాలని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేషసాయి తల్ప తీర్పును వెల్లడించారు. తీర్పు అమలులో భాగంగా కోర్టు ఆవరణలో చెట్లతోపాటు చెత్తచెదారాన్ని వారు శుభ్రం చేశారని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని హెచ్చరించారు.



బోధన్‌ కోర్టు ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

ఎల్లారెడ్డి: పట్టణంలో వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు విధిస్తు జిల్లా న్యాయమూర్తి వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలో ఒంటరిగా నివాసముండే శేర్ల సుజాత (55)ను గంగుల శ్రీనివాస్‌ అలియాస్‌ డీజే శ్రీను 2022 డిసెంబర్‌ 10న హత్య చేసి, ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు, తులం బంగారు గుండ్లను ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానాను జడ్జి విధించినట్లు ఎస్పీ తెలిపారు.

చీటింగ్‌ కేసులో ఇద్దరికి 15నెలల జైలు శిక్ష

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులోగల భూమిని అమ్ముతామని డబ్బులు తీసుకొని మరొకరికి భూమిని విక్రయించి చీటింగ్‌ చేసిన కేసులో ఇద్దరికి 15నెలల జైలు శిక్ష పడింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో భూమిని అమ్ముతామని ఫిర్యాదుదారుని వద్ద ఆవుల జగన్‌మోహన్‌రావ్‌, ఆవుల జీవన్‌ బాబు అనే ఇద్దరి వ్యక్తులు రూ. 7లక్షలు తీసుకున్నారు. మిగితా డబ్బులు ఇచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్‌ చేస్తామని చెప్పి బాండ్‌ పేపర్‌ రాశారు. కానీ కొన్ని రోజుల తర్వాత మరొకరికి భూమిని విక్రయించారని, 2013లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో కేసు నడువగా, శుక్రవారం ఆవుల జగన్‌మోహన్‌రావ్‌, ఆవుల జీవన్‌బాబుకు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ పూజిత 15 నెలల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తు తీర్పును వెల్లడించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో 3రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష పడ్డట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ శుక్రవారం తెలిపారు. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపిన 12మందికి కౌన్సెలింగ్‌ నిర్వహించగా, అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చామన్నారు. వారిలో 11 మందికి రూ. 15,500 జరిమానా విధించగా, చంద్రశేఖర్‌ కాలనీకి చెందిన షేక్‌ అబ్బాస్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

మాక్లూర్‌: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కారం మహేందర్‌ (45) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మహేందర్‌ ఇల్లు నిర్మించుకోవడానికి అప్పులు చేశాడు. వాటిని తీర్చలేని పరిస్థితిలో అప్పుల బాధ తట్టుకోలేక ఒత్తిడికి గురై గడ్డి మందును గురువారం రాత్రి తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుతి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాలూర మండల కేంద్రంలో..

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రం శివారులో బోధన్‌కు చెందిన ఆరుగొండ మహేశ్‌(30) ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మహేశ్‌ గత కొంతకాలం నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనెల 26న ఇంటి నుంచి రాత్రి సమయంలో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సాలూర శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఉండగా, మృతదేహాన్ని మహేశ్‌గా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



నిజామాబాద్‌ రూరల్‌: ముబారక్‌నగర్‌లోని వీవీనగర్‌కాలనీకి చెందిన తెలన్గు విజయలక్ష్మీ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్‌ శుక్రవారం తెలిపారు. విజయలక్ష్మీ గత కొన్ని రోజులుగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స తీసుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఎవరికి చెప్పకుండ బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వృద్ధురాలు ఎరుపురంగు చీర, క్రీంకలర్‌ జాకెట్‌ ధరించి ఉందని, ఎవరికైనా ఆచూకీ లభించినచో 87126 59849, 87126 59847ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌లో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. కాలనీలోని భక్త మార్కండేయ మందిరంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించగా స్థానికులు గమనించి, డయల్‌ 100కు సమాచారం అందించారు. అప్పటికే దొంగ పారిపోగా త్రీటౌన్‌ బ్లూకోర్ట్‌ సిబ్బంది గంగాధర్‌, నిఖిల్‌ అతడిని పట్టుకున్నారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.